# చిట్టి తల్లి

**'ఈ** ఒక్కసారయినా నా మాట వినండీ' - గొంతు జీరపోతుంటే బతిమలాడింది లావణ్య.

'ఇటువంటి విషయాల్లో నీదో మాట నాదో మాట కాకూడదని ఇప్పటికి చాలాసార్లు చెప్పాను' - రాజీవ్ పేపర్లోంచి ముఖం తీయకుండానే అరిచాడు.

'ఆఖరిసారి చెప్తున్నా, రెండురోజుల్లో ఈ విషయం తేలిపోవాలి' రాజీవ్ చేతిలో వున్న పేపర్ నేలకేసి విసిరింది లావణ్య. రాజీవ్ ముఖకవళికల్లో ఎలాంటి మార్పులేదు.

తుఫాను - అబ్బ - ఎన్ని కుటుంబాలని కూల్చేసిందీ - ఎందరి బతుకులు వీధిన పడిపోయాయి - తుఫాను - పచ్చపచ్చని ఊళ్ళు. శ్మశానవాటికల్లా మారిపోయాయి - తుఫాను బీభత్సదృశ్యాలు కళ్ళముందునుంచి కదలటం లేదు లావణ్యకి.

నాలుగు రోజులనాడు వచ్చిన మరో ఉత్తరం మనసులో మెదిలింది. 'ఈ ఉత్తరానికి కూడా సమాధానం రాయకపోతే నా నిర్ణయంలో మార్పుండదు - 'అది ఆఖరి వాక్యం!!

ఆ చీకటిలో అడుగుల చప్పుడుకి ఉలిక్కిపడింది లావణ్య.

"లైటు వేసుకోవేం -- అలా క్లబ్బు కెడదాం రా!" - రాజీవ్ గదిలో లైటు వేశాడు.

లావణ్య అలానే కూచుంది. 'తుఫానులూ, ఉప్పెనలూ వస్తూనే వుంటాయి. జననష్టం జరుగుతూనే వుంటుంది. మనం ఏంచేయగలం... లే... క్లబ్బు కెళ్ళి తంబోలా ఆడుకుని, భోజనం చేసివద్దాం."

రాజీవ్ మాటలకి భగ్గున మండిపడింది లావణ్య.

'మనం ఏమీ చేయలేమా..." అరిచింది లావణ్య. 'నువ్వేం చేస్తావ్ - ఓ వంద రూపాయలు పంపిచు తుఫాను సహాయనిధికి' నవ్వాడు రాజీవ్.

అర్ధగంట దాటింది - రాజీవ్ క్లబ్‌కి వెళ్ళిపోయాడు. లావణ్య అలానే కూచుంది - చేతిలో ఉత్తరం కదులుతోంది.

వారం రోజులు గడిచాయి. లావణ్య రాజీవ్ మధ్య మాటలు తగ్గిపోయాయి.

'మీ స్నేహితురాలు శారదకి ఫోన్ చేశాను ' రాజీవ్ అనగానే, 'ఫోన్ చేశారా... నిజంగా' ఆశ్చర్యపోయింది లావణ్య.

'తానేమందీ' -

'సరే అంది' - రాజీవ్ కారు స్టార్ట్ చేసుకు వెళ్ళిపోయాడు.

లావణ్య మనసు క్షణంలో ఆనందంతో నిండిపోయింది. రాజీవ్ పైకి అలా గంభీరంగా కనిపిస్తాడు కానీ, మనసు చాలా మంచిది అనుకుంటూ మురిసిపోయింది.

అంతలోనే లావణ్య మనసు ఆరేళ్ళ వెనక్కి వెళ్ళిపోయింది - అవి బి.ఏ. చదివేరోజులు. ఎంతో చలాకీగా, ధైర్యంగా ఉత్సాహంగా వుండే లావణ్యకి, సరిగ్గా అలాగే వుండే శారదకి మంచి స్నేహం ఏర్పడింది... రోజు రోజుకీ ఆ స్నేహం వృద్ధి పొందింది.

'నేను ఈ రోజు కాలేజికి రాను' అంది సందు చివర కనిపించి శారద.

'ఎందుకూ, సినిమాకెడుతున్నావా' అంది లావణ్య.

శారద నవ్వి, 'ఎక్కడికెడుతున్నానో చెప్తే ఆశ్చర్యపోతావ్'

'ఈ ఊళ్ళో చాలా మురికి వాడలున్నాయికదా... అక్కడికీ' ఛీ ఛీ... అక్కడ నీ కేంపని' ముఖం చిరాగ్గా పెట్టింది లావణ్య.

'ఆ మురికివాడలో పిల్లలకి ఆరోగ్యం గురించి చెప్తాం - అక్షరాలు దిద్దిస్తాం... ఇంకా ఇక్కడ ఆడవాళ్ళతో బోల్డు కబుర్లు చెప్తాం... 'శారద చెప్తుంటే శ్రద్ధగా వింది లావణ్య.

"ఇంకో విషయం విను... నేను ఒక విషయం నిశ్చయించుకున్నా...

తుఫానులూ, ఉప్పెనలూ వచ్చినపుడు, పాపం, ఎందరో పిల్లలు అనాధలైపోతారు - అలాంటివాళ్లని ఒక్కరినైనా తెచ్చి పెంచుకుంటా...

'పెంచుకుంటావా' ఆశ్చర్యంగా అరిచింది లావణ్య.

'అవును - ఏం ఒక్కపిల్లని పెంచి పెద్దచేయలేనా' శారద లావణ్య ముఖంలోకి చూసింది.

లావణ్య ఎటో చూస్తోంది... ఏదో ఆలోచిస్తోంది...

'నువ్వు ఒక్కర్తివీ అయితే సరే... మరి...'

'ఏమిటి నీభయం... పెళ్ళయితే, నాభర్త ఒప్పుకోకపోతే, నాకే పిల్లలు పుడితే... అదే కదా నీ సందేహం... 'శారద లావణ్య భుజంపై చేయివేసింది.

'ఇందులో తప్పుపనేమీ లేదు కదా - భయం దేనికి, ఆ భర్త కూడా మనిషేగా... ఎందుకొప్పుకోడూ - పాపం, ఆ అనాధపిల్లలకి, ఒక్కరికి సాయం చేసినా చాలు - నా నిర్ణయమైతే మారదు...'

లావణ్య చాలా శ్రద్ధగా వింది...

ఆ తర్వాత లావణ్య శారదకి స్నేహితురాలే కాదు, శిష్యురాలు, భక్తురాలుకూడా అయిపోయింది. శారద చెప్పే ప్రతి మాట గుండెలో భద్రపరుచుకుంది లావణ్య... కాలం పరిగెత్తింది!! - లావణ్య చేతిలో ఉత్తరం కదులుతోంది.

తుఫానులో తల్లితండ్రులను పోగొట్టుకున్న ఇద్దరాడపిల్లల్ని దగ్గరకి తీసింది శారద... ఒక పిల్లని తనే పెంచుకుంటోంది. ఇంకో పిల్లని లావణ్య దగ్గరికి పంపాలని నిర్ణయించింది.

అప్పటికి రెండు ఉత్తరాలు రాసింది శారద... ఇది మూడో ఉత్తరం!!

కానీ రాజీవ్ మనసు అంగీకరించటం లేదు... నాకు పిల్లలు పుట్టరని మరొకర్ని పెంచుకుంటానా - అయినా నా వాళ్లంతా నన్ను చూసి నవ్వరా. కాకపోయినా ఎక్కడ ఎవ్వరికి పుట్టిందో - ఛీ - నేనొప్పుకోను - అయినా పెళ్ళయి రెండేళ్ళేగా - ఇది రాజీవ్ ధోరణి.

అయినా ఒక్క అనాథపిల్లకి ఆశ్రయం ఇస్తే తప్పేముంది... ఎవరెందుకు నవ్వుతారూ - నాకు ఒక పిల్లపుడితే ఇది దానికి అక్క, పిల్లాడు పుడితే - వాడికిది అక్క - అంతే?! - ఇది లావణ్య ధోరణి.

నెలరోజులుగా తన మాటకాదన్న రాజీవ్, ఈ రోజు స్నేహితురాలికి ఫోన్ చేశాను' అనగానే పొంగిపోయింది లావణ్య.

వారం రోజులయింది...

ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలయింది. తలుపుకొడుతున్నారెవరో.

లావణ్య తలుపు తీయగానే ఎదురుగా శ్రీనివాస్, శారద భర్త... ఒక్క నిముషం ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయింది లావణ్య పాపని తెచ్చివుంటారు - ఉత్సాహంగా అటు ఇటు చూస్తూ,

'ఏదీ' అంది లావణ్య.

'మీ ఆయన చెప్పిన ఎడ్రసువాళ్ళకి అప్పగించి వచ్చేసాను' శ్రీనివాసు కుర్చీలో కూర్చున్నాడు.

లావణ్యకి ఒక్కసారిగా మతిపోయినట్లయింది. అంటే రాజీవ్ స్నేహితుడింట్లో దించివచ్చాడా ఆ పిల్లని - అంటే ఆ పిల్లని తమ పెంచకూడదా! రాజీవ్ ఎందుకింత మోసం చేశాడు తనని! ఎందుకు?! - లావణ్య మాట్లాడకుండా అలా నిలబడిపోయింది.

'మీకు ఒంట్లో బాగా లేదని మీరే ఆయన స్నేహితుడు రాఘవన్ ఇంట్లో దింపమన్నారని చెప్పాడు...'

శ్రీనివాస్ ఏమంటున్నాడో అర్థం అయింది లావణ్యకి!!

ఆ రాత్రి క్లబ్బునించి రానేలేదు రాజీవ్.

తెల్లవారింది తుఫాను తగ్గిన తెల్లవారి నాటి నిశ్శబ్దం ఇంట్లో తాండవించింది.

తన ఆశయాలు, తన వాగ్దానాలు అన్నీ ఒక్కసారిగా కుప్పకూలిపోయాయనిపించి దుఃఖ పొంగిపొర్లింది లావణ్యకి.

తనింట్లోనే శత్రువువుంటే!! లావణ్య కోపం కట్టలు తెంచుకుంది.

'ఓ అనాథ పిల్లని పెంచుకునే పాటి స్తోమత నాకు లేదా' - ఓ అర్థరాత్రి గట్టిగా అడిగింది లావణ్య నిద్రపోతున్న రాజీవ్ లేపి.

రాజీవ్ అటు ఒత్తిగిల్లి పడుకున్నాడు. ఎవరో కన్న పిల్లల్ని పెంచుకునే ఖర్మ తనకేమిటీ! - నిజానికి ఇదే మాట స్నేహితుడు రాఘవన్ కూడా అన్నాడు. కానీ, అతని భార్య లలిత మాట కోసం ఆ రోజు తల ఊపాడు - వాళ్ళు వద్దనుకుంటే అనాథశ్రమంలో దింపేస్తాడు - అంతే - రాజీవ్ నిద్ర పోయాడు హాయిగా.

శారద ముందు తన ఓటమి, తన ఆశయాలముందు తలవంచటంతో లావణ్య చాలా ఆవేదన చెందింది.

రెండు నెలలు గడిచాయి. ఓ రోజు లావణ్య బజారుకెళ్ళింది. ఇంటికి కావలసిన వస్తువులు కొనుక్కుందుకు.

తలవంచుకు నడుస్తోంది... ఏ నాలుగేళ్ళ పిల్లని చూసినా శారదపంపిన పిల్లే గుర్తొస్తోంది. ఆ పిల్ల వచ్చిన నాలుగో రోజు తను రాజీవ్ రాఘవన్ ఇంటికెళ్ళారు. రాఘవన్ భార్య లలిత కూడా చాలా ముభావంగా కనిపించారు. నల్లని కళ్ళతో, చిన్న జడతో, పొట్టి గౌనుతో ఆ పిల్ల తలుపు చాటునుంచి చూడ్డం గుర్తొచ్చింది లావణ్యకి....

ఇప్పుడెలా వుందో!! - లావణ్య కూరలు, వస్తువులు కొనుక్కుంటూ తలెత్తేసరికి అక్కడే లలిత కనిపించింది.

'ఎలావుందీ' అంది వెంటనే లలితని చూస్తూ.

'ఆ...ఏదో... అయినా తొందర పడ్డామనిపిస్తోంది. ఎవడుకన్నబిడ్డో - ఏమిటోలెండి, ఆరోజు మీ వారు నాథశరణాలయంలో చేర్చమంటే, మా వారు సరే అంటే నేనే అడ్డుపడ్డాను'...

లలిత మాటలు వింటూ విస్తుపోయింది లావణ్య... ఆ పిల్ల అంట్లుబాగా తోమదట - అదొచ్చిన దగ్గర నుంచి ఇంట్లో కలిసి రావటం లేదట - దాన్ని చూస్తే తన భర్తకి అసహ్యంట - ఇంకా, ఇంకా... లలిత మాటలు చెవులకి కఠోరంగా వినిపించాయి లావణ్యకి - అదేమిటి ఆ పిల్లని పనిమనిషిగా చేసేసారా... ఛీ, -

లావణ్యకి కోపంతో బుగ్గలు ఎరుపెక్కాయి. ఒక్కసారిగా రాజీవ్‌ను కొట్టాలనిపించింది. ఈ అన్యాయానికి కారణం ఎవరూ? - లావణ్య ఏదో మాట్లాడాలనుకుంటుండగానే, లలిత గబ గబా వెళ్ళిపోయింది...

ఆ సాయంత్రం లావణ్య ఆఫీసునించి భర్తరాగానే రోజుకన్నా ఉత్సహంగా మాట్లాడటం మొదలు పెట్టింది.

'మనం క్లబ్బుకెడదామా" - లావణ్య రాజీవ్ కుర్చీ పక్కనే కుర్చీవేసుకుంటూ అంది.

'ఏమిటీ - ఎవరిమాటలివి - నీవేనా' రాజీవ్ ఆశ్చర్యంగా అన్నాడు.

'నిజంగా అంటున్నావా' - రెట్టించాడు రాజీవ్.

క్లబ్బుకి వెడదామంటే ఏనాడూ ఉత్సాహం చూపని భార్య ఇవాళ తనే వెడదామనేసరికి ఆనందం, ఆశ్చర్యం రెండూ కలిగాయి రాజీవ్‌కి.

'ఇవాళ మీ ఫ్రెందు రాఘవన్, లలితకూడా వస్తారేమో' అంది లావణ్య మల్లెపూలు దండ కడుతూ.

'వాళ్ళు చాలాసార్లు వెళుతూంటారు - అయినా లావణ్యా, ఇవాళ ఏమిటి విశేషం' అన్నాడు రాజీవ్ మళ్ళా.

'లలితగారు బజారులో కలిశారు' లావణ్య కట్టిన పూలు సిగలో పెట్టుకుంటూ అంది.

రాజీవ్ ఉలిక్కి పడ్డాడు ఒక్కసారి.

లావణ్య లోపలికెళ్ళి చక్కగా తయారయింది. ఎర్రటి పెదవులు లిప్‌స్టిక్‌తో మరీ ఎర్రగా అందంగా కనిపిస్తున్నాయి. ఎర్రటి వెంకటగిరి జరీచీర తెల్లని లావణ్య ఒంటిపై మెరుస్తోంది...

'ఇంట్లో కూడా ఇంత చక్కగా ఉండొచ్చుగా' రాజీవ్ భార్య వంక చూస్తూ అన్నాడు.

'ఇంకా నయం, ఈ చీర ఖరీదు పదిహేనువందలు' అంది లావణ్య చీర అంచులు సరిచేసుకుంటూ.

లావణ్య క్లబ్బులో కూచుందేగాని కళ్ళముందు ఆ చిన్న పిల్లరూపమే కదులుతోంది... ఇక మనసు దాచుకోలేకపోయింది. రాజీవ్ మనసు నొప్పించకుండా?!

"చూసారా... కాలం ఎంత ఘోరంగా వుందో" అంది ముఖం గంభీరంగా పెట్టుకుని లావణ్య.

రాజీవ్ మాట్లాడలేదు. ఆ పిల్లని ఆనాథశరణాలయంలో వీలుచూసుకు తనే చేర్పిస్తానన్న విషయం లావణ్యకి లలిత చెప్పేసిందేమోనని కంగారుగా అనిపించిన రాజీవ్.

"క్లబ్బుకొచ్చాక కూడా ఘోరాలూ, అన్యాయాలూ ఎందుకు - మంచి కబుర్లు చెప్పూ" అన్నాడు లావణ్య వైపు చూసి

"ఇది ఎంతమంచి కబురో, వినండి మరి,

మనపై ఫ్లాట్‌లో వాళ్ళు ఆ మధ్య వాళ్ళ ఊరినించి ఓ పనిపిల్లని తెచ్చుకున్నారట - అయితే ఆవిడ ఆ పిల్లని కొట్టడం, తిట్టడెం చేస్తే, అది చెప్పకుండా ఇంట్లోంచి పారిపోయిందిట-'

"ఏమిటీ పారిపోయిందా -' ఒక్కసారిగా అన్నాడు రాజీవ్.

"ఆ... అయితే అసలు విషయం వినండి... ఆ పిల్ల టాంక్‌బండ్ దగ్గర కూచుని ఏదో ఆలోచిస్తుంటే, వాళ్ళకి పేపర్ వేసే అబ్బాయి చూసి, దాన్ని లాక్కొచ్చాడట - అది ఇంటికి రానని ఒకటే ఏడుపు -"

"ఏమిటి లావణ్య, ఏడుపులు, చావులు - ఏమిటది, ఛీ, ఇందుకేనా నన్ను క్లబ్బుకి తెచ్చావు' - విసుక్కున్నాడు రాజీవ్.

'కాదండీ, ఒక్కపిల్లకి గుప్పెడు అన్నం పెట్టి ప్రేమగా చూసుకోలేకపోతే, అసలు తెచ్చుకోకూడదు - పైగా ఆడపిల్ల - ఏ దారిలోకో వెళ్ళిపోతే, పాపం దాని బదుకేమవుతుందీ - 'నిట్టూర్చింది లావణ్య.

రాజీవ్ మాట్లాడలేదు - అవును, ఆడపిల్లని అలా వదిలేస్తే - రాజీవ్ గుండెలు వేగంగా కొట్టుకున్నాయి వేగంగా. పసిపిల్లల్ని రేప్‌చేసే కిరాతకులు, పనిపిల్లల్ని అమ్మేసే దుర్మార్గులు, పనిపిల్లల జీవితాలతో ఆడుకునే విలాసవంతులు.

ఛీ, ఛీ - ఎన్ని రకాల అన్యాయాల్ని భరిస్తోంది ఆడపిల్ల" - రాజీవ్‌లో సంఘర్షణ. చిన్న నీటిపొర కదిలింది!!

"పది నిముషాలు టి.వి. చూసి వస్తాను" అంటూ గబగబా ముందు గదిలో కెళ్ళి టి.వి. ముందు కూచున్నాడు రాజీవ్. లావణ్య ఎటో చూస్తోంది.

రాఘవన్, లలితల చిత్రమైన మనస్తత్వం గురించే ఆలోచిస్తోంది లావణ్య!!

పదిహేను రోజులు గడిచిపోయాయి. రాజీవ్ మనసులో ఆ పిల్ల మెదులుతోంది. తను చేసిన పని మంచిదా, కాదా - ఈ ప్రశ్నకి సమాధానం దొరకలేదు - నిద్ర లేక రాత్రులు గడిచిపోతున్నాయి.

తెల్లవారింది. రాజీవ్ కారు డ్రైవ్ చేసుకుని గబగబా వెళ్ళిపోతుంటే ఎక్కడిపో అర్ధంకాక గుమ్మంలో అలా నిలబడింది లావణ్య... ఇంకో రెండు నెలల్లో తను తల్లి కాబోతోందనే ఆలోచన హాయిగా అన్పించింది లావణ్యకి.

అర్ధగంటలో కారు పోర్టికోలో ఆగింది. రాజీవ్ వెంట నెమ్మదిగా లోపలికొస్తున్న చిన్న పిల్లను చూడగానే లావణ్య నోటమాట రాలేదు. ఆనందం పట్ట లేక ఆ చిన్న పిల్లను గట్టిగా కౌగలించుకుంది లావణ్య. రాజీవ్ గుండె బరువు తీరినట్టయింది... ఆశయాలకి విలువ కట్టడం ఎవరికి సాధ్యం!! లావణ్య నీళ్ళునిండిన కళ్ళు తుడుచుకుంటూ రాజీవ్ వైపు ప్రేమగా చూసింది.

రెండు నెలలు దాటాయి. ఆ పాపని దగ్గరల్లోని స్కూల్లో వేసింది లావణ్య. రోజూ రాజీవ్ పాపని స్కూల్లో దిగబెడతాడు. చిట్టితల్లి అంటూ ముద్దుగా పిలుచుకుంటుంది లావణ్య.

పోస్టుమాన్ పడేసిన ఉత్తరం చదువుతోంది ఈ లావణ్య. చిట్టితల్లి లావణ్య ముఖంలోకే చూస్తోంది.

"నా మీద మీకెంతయినా అసహ్యం కలిగివుంటుంది కదూ - నిజం చెప్తున్నా, ఆ పిల్ల గురించి నేను చెప్పిన మాటలేవీ నావి కావు - నాభర్తవే - ఆడపిల్లని పెంచుకోటానికి. వీల్లేదని నన్ను వేధించటం చివరికి దాన్ని ఎక్కడయినా వదిలేస్తారేమోనని భయ పడిపోయాను... అందుకే, ఆరోజు ఆ పిల్ల గురించి మీతో అలా మాట్లాడాను... రోడ్డున పడ్డ ఆడపిల్ల గతేమిటో తెలిసిందే, - నా మీద కోపమొచ్చినా, ఆ పసిదాన్ని చేరదీసినందుకు మీరు దేవత అంటాను - క్షమించమని మిమ్మల్ని అడగటమే కాదు, ఆ పసిదాన్ని కూడా అడుగుతున్నా... ఆఖరిమాట, మావారు నిన్ననే ఒక అబ్బాయిని అనాథాశ్రమంనుంచి తెచ్చారు - నన్ను క్షమించరూ'... 'లావణ్య కళ్ళనుంచి జలజలా నీళ్ళుకారుతుంటే, పక్కనే కూచున్న చిట్టితల్లి చూస్తూ.

"మమ్మీ, ఏడుస్తున్నావా... 'అంది.

ఉలిక్కిపడింది లావణ్య.

"ఆ..ఆ..కాదు..డాడీ పకోడీలు చేసి పెట్టమంటే ఉల్లిపాయలు తరిగాను కదా... అందుకు' కన్నీళ్ళు పైటతో తుడుచుకుంటూ అంది లావణ్య.

"ఉల్లిపాయపకోడీలు నిన్నకదా" -

"ఓ... అవునవును... నిన్నకదా" - లావణ్య చిట్టితల్లిని గుండెలకి హత్తుకుని పకపకానవ్వింది.

మమ్మీ ఇప్పుడే ఎందుకు ఏడ్చిందో మళ్ళీ ఎందుకు నవ్విందో అర్థంకాని చిట్టితల్లి లావణ్య ఒళ్ళో ఒదిగిపోయింది!! 'పాపం, లలిత' మనసులో అనుకుని నిట్టూర్చింది లావణ్య.

జనవరి - ఫిబ్రవరి 98 భూమిక 12